# కక్కు-కల్యాణం-ఉద్యోగం

తెలుగులో ఒక సామెతుంది. కక్కొచ్చినా కల్యాణమొచ్చినా ఆగవని.

అమెరికాలో, కక్కూ, కల్యాణమే కాదు, ఉద్యోగం వచ్చినా ఆగదు.

ఉద్యోగం, వచ్చేటప్పుడె కాదు పోయేటప్పుడు కూడా ఆగదు.

కొత్తగా ఇండియానించి వచ్చిన చాలమంది అడుగుతుంటారు, అమెరికాలో ఉద్యోగాలెలా వస్తుంటాయని.

కొంచెం సీరియస్‌గానే నా అనుభవాలూ, నా స్నేహితుల అనుభవాలూ చూస్తే, ఇండియానించి కొత్తగా వచ్చేవాళ్ళకి ఎందుకవి వింతగా కనిపిస్తాయో అర్ధమవుతుంది

నేను ఏనాడో అమెరికాకి వచ్చినప్పుడు ఉద్యోగాలిచ్చేఏజన్సీకి వెళ్ళాను. ఆ సెమినార్లో పదిమంది అభ్యర్ధుల్ని కూర్చోబెట్టి, మా ఇంస్ట్రక్టర్ అన్నది, మీరందరూ మనుష్యులు కాదని. అదేమిటి అని కొంతమంది ఎవరి ముక్కు మీద వాళ్ళే వేలేసుకుంటే, కొంతమంది ఎవరి బుర్రలు వాళ్ళే గోక్కున్నారు. ముక్కుల మీదనించి వేళ్ళూ, బుర్రల మీదనించి చేతులూ తీసేసే లోపలే, మీరంతా వస్తువులు అంది.

అసలే నేను అమెరికా వచ్చిన కొత్త రోజులేమో ఆవిడ మాట్లాడే టెక్సాస్ ఇంగ్లీష్ యాసే అర్ధం కాక చస్తుంటే, వ్యంగ్యంతో కూడిన ఆ భాష కూడాను.

మళ్ళీ అంది "ఒక ఉదాహరణ ఇస్తాను" అని.

బల్ల మీదనించీ రెండు టూత్ పేస్ట్ ప్యాకెట్లు బయటకు తీసింది. ఒకటి కాల్గేట్ ప్యాకెట్. రెండవది ఆకుపచ్చ, పసుపు పచ్చ రంగుల మధ్యన ఏదో అర్ధం కాని రంగులో వుంది. పేరుకూడా సరిగ్గా కనపడటం లేదు.

"ఈ రెండూ మీకు షాపులో దొరుకుతున్నాయనుకోండి. రెండూ ఒకటే ధర. వీటిల్లో ఏది కొంటారు" అని అడిగింది. అప్పుడు నేనూ, ఇప్పుడు మీరూ అనుకున్నట్టుగానే అందరూ అన్నది ఒకే మాట, "కాల్గేట్" అని.

ఆవిడ కాల్గేట్ టూత్‌పేస్ట్‌తో తోమిన తన తెల్లటి పళ్ళు కనపడేటట్టు నవ్వి, రెండు పెట్టెల్లోనించీ ఒకేరకంగావున్న రెండుకాల్గేట్ టూత్‌పేస్ట్ ట్యూబుల్ని బయటకు తీసింది. అయితే లోపల సరకు అంతా ఒకటేనన్న మాట.

"మీరు కాల్గేట్ ప్యాకేజీనే ఎందుకు ఎన్నుకున్నారు" అని అడిగింది.

"అది మనకి తెలిసిన బ్రాండ్ కదా" అన్నాను నేను, సంశయాత్మకంగా.

"కాల్గేట్ ప్యాకెట్ చూడటానికి చాల అందంగా వుంది. ఆ రెండ్ ప్యాకెట్

అదోరకంగా, యాక్కీగా వుంది" అన్నది, కొండను తవ్వకుండానే ఎలుకను పట్టిన అందమైన ఒక బ్లాండ్ (రాగి రంగు) జుట్టు అమ్మాయి.

"అవును. అవి రెండూ ముఖ్య కారణాలు. ముందు రెండో కారణం గురించి మాట్లాడుకుందాం. ప్రొడక్ట్ ఏదయినా, ఎలాటిదయినా, ప్యాకేజింగ్ ఎంతబాగుంటే అంత తొందరగా అమ్మవచ్చు. అంటే మీరు ఎంత మంచి ప్రొడక్ట్ అయినా, మీరు మిమ్మల్ని ప్యాకేజ్ చేసుకునే విధానాన్ని బట్టి మీరు ఉద్యోగాల మార్కెట్‌లో త్వరగా అమ్ముడు పోవటానికి ఆస్కారం వుంది. కాల్గేట్ పేరు మీ అందరికీ ఎలా తెలిసింది? ముఖ్యంగా వాళ్ళు రోజూ ఇచ్చే టీవీ, పేపర్ ఎడ్వర్టైజ్‌మెంట్లు చూసి. అందుకని, ఇందాక మీరు చెప్పిన మొదటిది ప్రొడక్ట్ ఎడ్వర్టైజ్‌మెంట్‌ని బట్టి వుంటుంది. ఇక్కడ మీకు మంచి ఎడ్వర్టైజ్‌మెంట్ ఇచ్చేది మీ రెస్యూమే (సి.వి.), మీ రిఫెరెన్స్‌లు. (రిఫెరెన్స్‌లు అంటే రికమెండేషన్ చేశేవాళ్ళన్నమాట) ఆ రెండిటిమీదా మీరు దృష్టి కేంద్రీకరించటం అవసరం" అని తన సెమినార్ టాక్ పూర్తిచేసింది. ఆవిడ ఆనాడు చెప్పింది, ఈనాటి దాకా అమెరికన్ ఉద్యోగాల మార్కెట్‌లో నూటికి నూరుపాళ్ళు నిజం.

నా మొట్టమొదటి రెస్యూమేలో నేను ఆత్రేయపురంలో పుణ్యగోదావరీ తీరాన పుట్టాననీ, చిన్నప్పుడు క్రికెట్ ఆడేవాడిననీ పెద్దయాక మానేశాననీ కథలు కూడా వ్రాశేవాడిననీ, పెద్దయినా అవింకా మానేయలేదనీ, ఇలాటి విశేషాలు చాల వ్రాశాను. అమెరికాలో ఏమని చెబుతారంటే రెస్యూమే మన ఆత్మకథలాగా వుండకూడదని. ఆత్మకథలాగా వుంటే, కథ చదివేసి ఓ నిట్టూర్పు విడిచేసో, చిరునవ్వు చిందించేసో, ఇంకేదన్నా చేసో అవతల పారేస్తారు.

అందుకని రెస్యూమేలో పూర్తి వివరాలు ఇవ్వకుండా, ఆ ఉద్యోగానికి అవసరమైన ముఖ్యమైన విషయాలుమాత్రమే బులెట్ రూపంలో వుండాలంటారు. ఎందుకంటే అవి చదివిన వారికి మిగతా కథ ై ఆర్పై చూడండి అని అనిపిస్తేనే ఆ వెండితెరని మీ కోసం ఇంటర్వ్యూలో సిద్ధంచేసి, ఒ మిగిలిన కథకోసం మిమ్మల్ని పిలుస్తారు. అంటే రెస్యూమే మనకి ఇంటర్వ్యూ తెప్పించాలి. ఇంటర్వ్యూ ఉద్యోగం తెప్పించాలి. అదన్నమాట. పేపర్లల్లోనూ ట్రేడ్ పుస్తకాలలోనూ ఇంటర్నెట్‌లోనూకనపడే ఉద్యోగాలు ఎనిమిది శాతం కన్నా తక్కువట. మిగలా ఉద్యోగాలన్నీ, అంటే తొంభై రెండు శాతం తెలిసినవారి ద్వారా (నెట్‌వర్కింగ్ అంటారు) వస్తాయన్నమాట. తెలిసిన వాళ్ళు అంటే మనకి అందరూ తెలియక్కర్లేదు. తెలిసినవాళ్ళకి తెలిసినవాళ్ళకి తెలిసినవాళ్ళయినా చాలు. లేక ఆ కంపెనీలకి తెలిసిన జాబ్ ఏజెంటులయినా చాలు. ఇండియాలో రికమెండేషన్ అంటారే ఇది దాదాపలాటిదే. రికమెండేషన్ అంటే మన వేపు మంత్రిగారికి తెలిసిన పరమ శుంఠాగ్రేసర చక్రవర్తికి ఉద్యోగమిప్పించమని చేసే రికమెండేషన్‌లాటిది కాదు. అతను/ఆమె ఇటు పనిలోనూ, అటు పనిలో చూపే ప్రవర్తన, వైఖరి (ఆటిట్యూడ్)లోనూ చాల గొప్పవాళ్ళనీ బాగా ఉపయోగపడతారనీ, మనం వాళ్ళని గట్టిగా రికమెండ్ చేయటమన్నమాట. అలా చేసినందువల్ల, మొదటి తొంభై రోజుల్లో వారి పనితనం చూసి సంతోషించి, అలా రికమెండ్‌చేసిన వాళ్ళకి (అమెరికాలో రిఫరెల్ అంటారు), ఎన్నో పెద్ద కంపెనీలలో కొంత డబ్బు కూడా ఇస్తుంటారు.

మన రికమెండేషన్ కాండిడేట్ బాగాలేకపోతే, వాళ్ళకి ఉద్వాసన, మన మాటకి గౌర వం పడిపోవటం వెంటనే జరుగుతుంది కనుక, అలాటి రికమెండేషన్లు సాధారణంగా సత్తువి కాకుండా, సత్తాని బట్టి వుంటాయి. ఉండాలి. కాబట్టి ఒకసారి పరిచయమయి నవారిలో ఆపరిచయాన్ని కొనసాగించటం ఎంతో అవసరం. ఎప్పుడు, ఎవరితో, ఏమ వసరం వస్తుందో మరి!

అలాగే ఉత్తరాలతో పనులు జరగవు. మీ రెస్యూమే నచ్చితే వెంటనే ఫోన్ లో పిలిచి, మీరు వాళ్ళ కంపెనీ వృద్ధికి ఏంచేయగలరూ అని మీతో మాట్లాడతారు. నచ్చితే వెంటనే ఇంటర్వ్యూ. అక్కడే జీతాలూ బత్తేలూ గురించి మాట్లాడుకోవటం. వెంటనే ఉద్యోగంలో చేరిపోవటం. అంతా చకచకా జరిగిపోతుంది. ఒక్కొక్కసారి ఇ దంతా రెండు మూడు రోజుల్లోపలే జరిగిపోతుందంటే ఆశ్చర్యంగానూ, కొత్తవాళ్ళకి గాబరాగానూ వుంటుంది. కక్కొచ్చినా మందులలో అపుకోవచ్చు కానీ అమెరికాలో ఇలా వచ్చే ఉద్యోగావకాశాలను మాత్రం వదులుకోవటం కష్టం.

ఉద్యోగం రావటమే కాదు పోవటంకూడా అంతే. ఇప్పుడు ఎకానమీ బాగా లేక, కంపెనిలకు లాభాలు లేక, సర్వత్రా ఉద్యోగాలు పోతాయని ముందే ఊహిస్తు న్నారు. కానీ, ఇంతకుముందు ఇలా కాదు. బాగా పని చేస్తూ ఎంతో కష్ట పడుతున్న వాళ్ళకి కూడా ఇది ఒక విద్యుద్ఘాతంలా, హై ఓల్టేజీ షాక్ ఇస్తుంది. చాల కంపెనీల్లో ఎవరో మేనేజరో, డైరెక్టరో వచ్చి ఆ "లేఆఫు" సువార్తని ఒక చేత్తో అందించి, రెండో చెత్తో షేక్ హాండ్ చేసి, వెంటనే- అంటె అప్పటికప్పుడే, ఆ చేత్తోటే మీ పుస్తకాలూ, స్వంత సామానులు పెట్టిన అట్టపెట్టెలూ మీ కారులో పెట్టి, హావ్ ఎ నైస్ డే అని మీకు అప్పగింతలు చెబుతాడు. మా స్నేహితుడొకడిని ఇలాగే పంపించేటప్పుడు ఆరడుగు ల పొడవున్న తెల్లటి అమెరికన్ డైరెక్టర్ మధ్యాహ్నం మూడు గంటలకి అతని దగ్గరకి వచ్చి, "ఏంచాయ్! సుబ్బారావ్! నీ అంత గొప్పవాడు మాకు దొరకటం మా అదృ ష్టం. దొరికినా మా కంపెనీ అభివృద్ధికి నిన్ను సరిగ్గా వాడుకోలేకపోవటం నిజంగా మా దురదృష్టం. అందుకే నిన్ను బయటికి పంపించేయాల్సి వస్తున్నదని చెప్పటానికి నా గుండెలు తరుక్కుపోతున్నాయి" అన్నాట్ట.

ఆయన చెప్పిన తన అదృష్టాన్నీ, ఆ కంపెనీ దురదృష్టాన్నీ ఒక్క క్షణం తలుచుకుని, ఆనందం+బాధ పడ్డ మన సుబ్బారావ్, మరి అయితే ఎప్పుడు నా చివరి రోజు" అని అడిగాడు.

"మనం స్నేహితుల్లాగా విడిపోవాలని నిర్ణయించుకున్నాక, ఇంకా ఆలోచ నెందుకోయ్! ఆలస్యం అమృతం విషం అన్నారు మీ తెలుగులో. ఇప్పుడే అప్పగింత లు చెప్పేసుకుంటే పోలా" అని పార్కింగ్ లాట్ దాకా తోడు వచ్చాట్ట.

ఉద్యోగాలు ఎంత త్వరగా పోతాయో, ఎకానమీ బాగుపడగానే మళ్ళీ అంత త్వరగానే వస్తాయి కూడాను.

అందుకే అమెరికాలో, కక్కొచ్చినా, కల్యాణమొచ్చినా, ఉద్యోగమొచ్చినా ఆగవు

* * *